## క్లుప్తంగా

### నేడు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు త్యాగరాజ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక మంగమూరు డొంక గాయత్రి మందిరంలో త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాల సంగీత కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు నేలంబొట్ల సౌమ్య శిష్య బృందంచే త్యాగరాజస్వామి వారి ఉంఛవృత్తి కార్యక్రమాలు, సాయంత్రం ఆరు గంటలకు సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీ త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలు, జ్యోతి ప్రజ్వలన, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విజేతలకు మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత పి.ప్రకాష్‌చే బహుమతులు అందజేయనున్నారు. సంగీత ప్రియులంతా పాల్గొనాలని త్యాగరాజ సేవాసమితి నిర్వాహకులు కోరారు.

### తెల్లవారుజామునే పారిశుధ్య పనులు ప్రారంభించాలి

ఒంగోలు సబర్బన్: నగరంలో ప్రతిరోజూ తెల్లవారుజామునే పారిశుధ్య పనులు ప్రారంభించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని రెండు పారిశుధ్య విభాగాలకు చెందిన డివిజన్లలో పనులను పరిశీలించారు. మొదట 4వ శానిటేషన్ డివిజన్ పరిధిలోని ట్రంక్ రోడ్‌లో పారిశుధ్య పనులను పరిశీలించి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు సూచనలు చేశారు. అనంతరం 1వ శానిటేషన్ డివిజన్‌లోని అద్దంకి బస్టాండ్, కర్నూల్ రోడ్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు.

### రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

దర్శి: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కొత్త రెడ్డిపాలెం సమీపంలో గురువారం రాత్రి జరిగింది. దర్శికి చెందిన జగన్నాథం శ్రీను పొదిలి నుంచి దర్శికి వస్తున్నాడు. పెరుకె రాంబాబు దర్శి నుంచి పొదిలి వెళ్తున్నాడు. కొత్తరెడ్డిపాలెం గ్రామం దాటిన వెంటనే ఎదురెదురుగా వచ్చిన మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరూ కింద పడిపోయారు. శ్రీనుకు కాలు విరగ్గా రాంబాబుకు తలపై దెబ్బ తగిలి ముక్కులు, చెవులు, నోట్లో నుంచి రక్తం వచ్చింది. క్షతగాత్రులను 108లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

### 20న మండల సమావేశం

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

### ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

పొదిలి రూరల్: పొదిలి ఆర్టీసీ బస్టాండ్‌లో నిత్యం దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. రోజూ ఏదో ఒక సమయంలో ప్రయాణికుల దగ్గర నుంచి విలువైన సెల్‌ఫోన్లు, నగదు జేబుదొంగలు దోచుకుంటున్నారు. గురువారం పొదిలి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఓ యువతి పర్సు కొట్టేశారు. అందులో ఉన్న 8 వేల రూపాయలు దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆ యువతి కన్నీరు పెట్టుకుంది. చివరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### క్రీడా వికాస కేంద్రం లీజుకు దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం టౌన్: పట్టణంలోని క్రీడా వికాస కేంద్రం లీజు కోసం ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీఓ జి.రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ టెండర్లను ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ ఒంగోలులోని డాక్టర్ పి.ఆనంద్ మినీ స్టేడియంలో అందజేయాలని కోరారు. అందిన దరఖాస్తుల వివరాలను ఫిబ్రవరి 6వ తేదీన వెల్లడిస్తామన్నారు. వివరాలకు 91211 06840 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### నాగుపాము కలకలం



నాగుపామును పట్టుకుంటున్న ఫారెస్టు సిబ్బంది

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల సమీపంలో నాగుపాము కలకలం రేపింది. ఓ గృహంలో నాగుపాము బుసలు కొడుతూ కనిపించడంతో ఫారెస్టు అధికారులకు సమాచారమందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అటవీ శాఖ సిబ్బంది పామును పట్టుకొని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి వదిలేశారు.

# క్రీడలు వద్దు.. జూదం ముద్దు..!

- విడ్డూరంగా సంతనూతలపాడు పోలీసుల తీరు
- సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలకు అనుమతి ఇవ్వని వైనం
- కోడి పందేలు, పేకాట, గుండాట నిర్వహిస్తున్నా పట్టించుకోకుండా పరోక్షంగా ప్రోత్సాహం
- కూటమి నేతల ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో యథేచ్ఛగా జూదం
- బరుల వద్దే బెల్ట్ షాపులు
- చోద్యం చూసిన పోలీసులు



సంతనూతలపాడులోని ముగ్గ వాగు వద్ద నిర్వహించిన కోడి పందేలు

సంతనూతలపాడు: మండలంలోని పోలీసుల తీరు విడ్డూరంగా ఉంది. అడ్డగోలుగా వ్యవహరిస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని కూటమి పార్టీల నాయకులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా పట్టించుకోకపోవడం, కోడి పందేలు, పేకాట, గుండాట లాంటి జూదాలు నిర్వహిస్తున్నా చోద్యం చూస్తూ పరోక్షంగా ప్రోత్సహించడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో కూటమి పార్టీలతో సంబంధం లేని వారు సంక్రాంతికి క్రికెట్ పోటీలు నిర్వహించుకుంటామని అనుమతి కోరితే నిరాకరించడంతో ఇదేం పద్ధతి అంటూ పోలీసుల తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా క్రీడలు వద్దు.. జూదం ముద్దు అన్నట్లుగా పోలీసులు వ్యవహరించి అవినీతి మత్తులో, కూటమి పార్టీల నాయకుల సేవల్లో మునిగితేలడంపై సంతనూతలపాడు మండలంలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

**క్రికెట్ పోటీలు వద్దన్న పోలీసులు...**

క్రికెట్‌లో యాక్టివ్‌గా ఉండే ఇద్దరు యువకులు ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించారు. వారి జ్ఞాపకార్థం వారి పేరుమీద సంతనూతలపాడు స్పోర్ట్స్ అసోసియేషన్ తరఫున సంక్రాంతి సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్లో క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా పరిషత్ నుంచి పర్మిషన్ తీసుకుని మైక్ పర్మిషన్ కోసం చలానా కట్టి అనుమతి కోసం ప్రయత్నించారు. కానీ, స్థానిక పోలీసులు అనుమతి ఇవ్వకుండా నిరాకరించారు. క్రికెట్ పోటీలు పెట్టడానికి వీల్లేదని అడ్డుకున్నారు. జిల్లా ఎస్పీ మాత్రం సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ క్రీడలు మాత్రమే నిర్వహించాలని, జూదం వద్దని పిలుపునిచ్చినప్పటికీ.. సంతనూతలపాడు పోలీసులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. కూటమి పార్టీల నాయకుల కనుసన్నల్లో పనిచేస్తూ క్రీడలకు అనుమతి ఇవ్వకపోగా, అసాంఘిక కార్యక్రమాలకు అండగా నిలిచారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మండలంలో స్థానిక పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

**మండలంలో పెద్ద ఎత్తున జూదం...**

సంక్రాంతి మూడు రోజుల పాటు మండలంలో ఎక్కడ చూసినా కోడి పందేలు, పేకాట, గుండాట, బెల్టు షాపుల కోలాహలం కనిపించింది. గోవా, బ్యాంకాక్ తదితర చోట్ల కళ్లుమిరుమిట్లు గొలిపే క్యాసినోల మాదిరిగా సంతనూతలపాడు మండలం బీ మాచవరంలో టీడీపీ నాయకులు మూడు రోజులుగా తెల్లవారింది మొదలు పొద్దుపోయేంత వరకు పేకాట, గుండాట, తదితర జూద క్రీడలను విచ్చలవిడిగా నిర్వహించారు. సంతనూతలపాడులోని ముగ్గ వాగు కేంద్రంగా కోడి పందేలు భారీగా జరిగాయి. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన జూదరులు ఇక్కడికే వచ్చి కోడి పందేలు వేశారు. అంతా బహిరంగంగానే జరిగినా.. పోలీసులు అటువైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయలేదు. నిర్వాహకులు అధికార పార్టీ వారు కావడంతో ఆ ఒత్తిళ్లతో పాటు మామూళ్ల మత్తులో మిన్నకుండిపోయారు. క్రీడలకు అనుమతులు ఇవ్వకపోగా, జిల్లా పోలీసు కార్యాలయానికి కూత వేటు దూరంలోనే విచ్చలవిడిగా కోడి పందేలు, పేకాట, గుండాట, ఇతర జూదాలు, బెల్టు షాపులు వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలను స్థానిక పోలీసులు ప్రోత్సహించి యువతను తప్పుదారి పట్టించడంపై ప్రజలు అసహ్యించుకుంటున్నారు. అధికార పార్టీ నాయకులు, పోలీసుల తీరును ఛీ కొడుతున్నారు.

### ఓ కానిస్టేబుల్ నిర్వాకంతో జూదానికి ప్రాధాన్యం...

అధికార పార్టీ అండదండలతో సంతనూతలపాడు పోలీసుస్టేషన్లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ నిర్వాకంతో కూటమి నేతలు నిర్వహించిన జూదాలు, అసాంఘిక కార్యకలాపాలు సవ్యంగా సాగేలా పోలీసులంతా సహకరించారు. ఈ వ్యవహారం మొత్తానికి ఆ కానిస్టేబులే చక్రం తిప్పినట్టు సమాచారం. స్థానిక పోలీసుస్టేషన్లో అన్నీ తానై వ్యవహరిస్తున్న సదరు కానిస్టేబుల్ వ్యవహారశైలిపై ఇతర సిబ్బంది కూడా అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం.

### గొలగమూడి వెంకయ్య స్వామికి ప్రత్యేక పూజలు

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలోని గొలగమూడి వెంకయ్యస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు పాల్గొని స్వామివారి గొప్పతనాన్ని వివరించారు. వెంకయ్యస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక హారతులిచ్చి పూజలు చేశారు.

### శోభాయమానంగా గిరి ప్రదక్షిణ

ఒంగోలు మెట్రో: స్కందగిరి శ్రీగిరి ప్రదక్షిణ సేవా కమిటీ నిర్వాహకుడు బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి నేతృత్వంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామిని సుందరంగా అలంకరించి భక్తాదులు గోవింద నామాలు, విష్ణు సహస్రనామ స్తోత్రాలు పటిస్తుండగా నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీగిరి పాదపీఠం వద్ద శ్రీ బాపూజీ గో సంరక్షణ శాలలో స్వామివారి రథంపై చిన్నారులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం భజంత్రీలు మోగుతుండగా వందలాదిగా భక్తులు తరలిరాగా స్వామివారి గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. స్థానిక కోర్టు సెంటర్, గ్రంథాలయం, కేశవస్వామిపేట, భగీరథ సెంటర్, వేప అంకమ్మ తల్లి దేవాలయం మీదుగా శర్మ కాలేజీ క్రికెట్ గ్రౌండ్ ముందుగా గద్దలగుంట, రాజాపానగల్ రోడ్డు మీదుగా శ్రీగిరి స్కందగిరి చేరి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు

# అర్ధరాత్రి నీటి విడుదలతో అవస్థలు

- ఒంగోలు ఇస్లాంపేటలో మూడు రోజులకు ఒకసారి అర్ధరాత్రే మంచినీటి సరఫరా
- నిద్ర మానుకుని నీటి కోసం పాట్లు పడుతున్న ప్రజలు
- అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంపై విమర్శలు

ఒంగోలు టౌన్:

నగరానికి నడుబొడ్డున ఉన్న ఇస్లాంపేట.. అభివృద్ధి విషయంలో శివారు ప్రాంతానికంటే కూడా వెనకబడి ఉంది. అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నట్లుగా స్థానికంగా కమ్యూనిటీ హాలు ఆవరణలో మంచినీటి ట్యాంక్ నిర్మించినప్పటికీ అందులోంచి చుక్కనీరు వాడుకునే అవకాశం లేక ప్రజలు అల్లాడుతున్నారు. నగరపాలక సంస్థ ప్రతి మూడు రోజులకోసారి మంచి నీరు విడుదల చేస్తోంది. కానీ, ఇస్లాంపేటకు మాత్రం అర్ధరాత్రి నీరు విడుదల చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే తంతు కొనసాగుతుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంపై విమర్శిస్తున్నారు.

**మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుతో ఇస్లాంపేటకు ఉపయోగం శూన్యం...**

ఇస్లాంపేటలో మొత్తం 6 నుంచి 7 వేల మంది ప్రజలు నివసిస్తుంటారు. ముఖ్యమైన ప్రాంతం మక్కా మసీదు. ఈ మసీదుకు ఎదురుగా ఉన్న 300 గదుల ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం ముస్లిం సమాజం ప్రయోజనాల కోసం కేటాయించింది. ఈ స్థలంలో కమ్యూనిటీ హాలుతో పాటు ఉర్దూ స్కూలు నిర్మించాలన్నది ముస్లింల ఉద్దేశం. అయితే ముస్లింల ఆలోచనలకు భిన్నంగా ఇక్కడ వాటర్ ట్యాంకు నిర్మించారు. ఈ ట్యాంకు నిర్మాణం జరిగితే ఇస్లాంపేటలోని గృహాలకు మోటార్లు లేకుండానే పైపుల ద్వారా నీళ్లు వస్తాయని అధికారులు, పాలకులు నమ్మబలికారు. దాంతో సుమారు 100 గదుల్లో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. కానీ, దానివలన ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ట్యాంక్ నుంచి దిగువ ప్రాంతాలైన బలరాం కాలనీ, భరత్ నగర్, బాలినేని కాలనీ, కేశవరాజుకుంట, గడ్డికొయ్యల తదితర ప్రాంతాలకు నీరు సరఫరా చేస్తున్నారు. ఇస్లాంపేటకు మాత్రం ఎప్పటిలాగే అద్దంకి బస్టాండు సెంటర్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచే నీళ్లు సరఫరా చేస్తున్నారు. కళ్లముందు నిలువెత్తు మంచినీటి ట్యాంక్ ఉన్నప్పటికీ అవసరానికి ఉపయోగపడకపోవడంతో ఇస్లాంపేట ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తప్పడంలేదు.

**అర్ధరాత్రి మంచినీటి విడుదల...**

నగరపాలక సంస్థ ప్రతి మూడు రోజులకోసారి నీరు విడుదల చేస్తోంది. అదికూడా రాత్రి 10 నుంచి 12 గంటల మధ్య, ఒక్కోసారి తెల్లవారుజామున 2 గంటల వరకు నీరు విడుదల చేస్తోంది. ఇక్కడ నివసించే ప్రజలలో అత్యధిక శాతం మెకానిక్‌లుగా, కార్మికులుగా పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. పగలంతా పనులు చేసుకొని ఇంటికి వచ్చాక అలసిపోయి ప్రశాంతంగా రాత్రి పూట నిద్రపోయేందుకు వీలులేకుండా మంచినీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. పగలంతా ఇంటి పనులు, వంట పనులు చేసుకుని అలసిపోయిన మహిళలు రాత్రంతా నీళ్లు పట్టుకోవాలంటే చిరాకు పడుతున్నారు. ఈ విషయంలో అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని మహిళలు విమర్శిస్తున్నారు. నగరంలో ఇన్ని డివిజన్లు ఉండగా, కేవలం ఇస్లాంపేటకే ఎందుకీ శాపం అని ప్రశ్నిస్తున్నారు. నాయకులు, అధికారుల నిర్లక్ష్యం వలనే అర్ధరాత్రి నీటి యుద్ధాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రంజాన్ మాసంలోనైనా పగటిపూట నీళ్లిస్తారా..?**

ముస్లింలు రంజాన్ మాసంలో నెల రోజుల పాటు ఉపవాసాలు ఉంటారు. తెల్లవారుజామున 3 గంటలకు నిద్రలేచి సహరి కోసం తయారీ చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత సాయంత్రం 6.30 ప్రాంతంలో ఇఫ్తార్ జరుగుతుంది. ఆ తర్వాత రాత్రి 9 నుంచి 10 గంటల వరకు తరావీహ్ నమాజులు చదువుతారు. అయితే, రంజాన్ మాసంలో కూడా రాత్రి పూట నీటిని విడుదల చేస్తుండటంతో ముస్లింలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం మానవతా దృక్పథంతోనైనా రంజాన్ మాసంలో అయినా పగటి పూట నీరు విడుదల చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఇస్లాంపేటకు నీరివ్వాలి**



ఇస్లాంపేట కమ్యూనిటీ హాలు స్థలంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించే సమయంలో ఈ ట్యాంకు నుంచే ఇస్లాంపేటకు నీరిస్తామని చెప్పారు. కానీ, ఆ ట్యాంకు నుంచి మాకు ఒక్క చుక్క కూడా నీరివ్వకుండా దిగువ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు దిగువ ప్రాంతాలలో కూడా ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. అందువలన ఇస్లాంపేట ట్యాంకులోని నీటిని ఇస్లాంపేట ప్రజలకే సరఫరా చేయాలి. అప్పుడు అర్ధరాత్రి నీరు విడుదల చేయాల్సిన అవసరం ఉండదు. అధికారులు, ప్రజాప్రతినిధులు అందుకోసం చొరవ తీసుకోవాలి. ఇస్లాంపేట ప్రజల దీర్ఘకాలిక సమస్య పరిష్కరించాలి.

– షేక్ రవూఫ్, కమ్యూనిటీ హాలు కమిటీ ఉపాధ్యక్షుడు

# టీటీడీ ఆధ్వర్యంలో గో పూజలు



మామిడిపాలెం వేణుగోపాలస్వామి ఆలయంలో గో పూజలో పాల్గొన్న భక్తులు



సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో...

ఒంగోలు మెట్రో: ముక్కనుమ సందర్భంగా ఒంగోలు నగరంలోని పలు దేవస్థానాలలో గురువారం ఘనంగా గో పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక మామిడిపాలెం వేణుగోపాలస్వామి దేవస్థానంలో అర్చకులు, దేవస్థాన కమిటీ పెద్దలు, టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ గో పూజలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు వెండి గోవుకు పంచామృత అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం కమిటీ ప్రతినిధులు బట్టు వెంకట్రావు, బత్తుల వెంకట సురేష్, చిటిబోయిన వెంకట్రావు, మల్లికార్జునరావు స్థానిక భక్తులు పాల్గొన్నారు. బాపూజీ గో సంఘం గోశాలలో, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఆలయ నిర్వాహకులు అళహరి చెంచల రావు, లక్ష్మీప్రసన్న కుమారి, స్థానిక భక్తులు, పాల్గొని గో పూజ నిర్వహించారు.

# ఆకట్టుకున్న పడమటి గాలి నాటకం



బహుమతులు అందజేస్తున్న అభ్యుదయ సమితి ప్రతినిధులు

ఒంగోలు టౌన్:

ఉలిచి అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ప్రదర్శించిన పడమటి గాలి నాటకం ప్రజలను ఆకట్టుకుంది. పండుగను పురస్కరించుకుని మండలస్థాయి వాలీబాల్, ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, స్లో సైకిలింగ్, లెమన్ స్పూన్, నృత్య ప్రదర్శన పోటీలలో విజేతలకు గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన చదువులతల్లి బాలలత, ప్రముఖ సినీ దర్శకుడు మలినేని గోపీచంద్ ప్రసంగించారు. ఉలిచి గ్రామాభివృద్ధి కోసం తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. ప్రతి ఏడాది ఇదే విధంగా పండుగ నిర్వహించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అదేవిధంగా స్వచ్ఛ ఉలిచి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉలిచి అభ్యుదయ సేవా సమితి ప్రతినిధులు గార్లపాటి రామారావు, చుంచు నరసింహారావు, బోయిడి ఆంజనేయులు, చప్పిడి రవీంద్రబాబు, బొద్దులూరి రామారావు, బొద్దులూరి హనుమంతరావు, చేజర్ల వెంకటరావు, చుంచు రామకృష్ణ, ఇనగాల చక్రపాణి, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, మంచు మురళి తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్లపై క్షేత్రస్థాయి పరిశీలన



కూనంనేనివారిపాలెంలో లబ్ధిదారుల పరిశీలన అనంతరం వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

చీమకుర్తి రూరల్: మండలంలో మంచానికే పరిమితమై 15 వేల రూపాయల పింఛన్లు పొందుతున్న 20 మంది లబ్ధిదారుల మెడికల్ ధ్రువీకరణ పత్రాలను గురువారం వైద్యశాఖ అధికారులు పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వైద్యులు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని, ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన వివరాలు సేకరించారు. సంబంధిత యాప్లో ఆ వివరాలు నమోదు చేశారు. వారి ఫొటోలు అప్లోడ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర, వైద్యాధికారులు అశోక్, చారి, కమల తదితరులు పాల్గొన్నారు. అయితే, ఈ పరిశీలనపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కొత్త పింఛన్లు ఇవ్వకపోగా, ఇస్తున్న పింఛన్ల ఏరివేతకు శ్రీకారం చుట్టిందన్న విమర్శలున్నాయి.

## ముగ్గులు, ఆటల పోటీల విజేతలకు బహుమతులు



పూజలు అందుకుంటున్న జెండాచెట్టు వీరాంజనేయస్వామి మూలవిరాట్



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

సంతనూతలపాడు: సంక్రాంతి సంబరాలలో భాగంగా మండల కేంద్రంలోని జెండా చెట్టు వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో రెడ్డిగారిబజార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు, ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సిరి హాస్పిటల్ ఎండీ జే మధుబిందు, శ్రీ లలిత డెంటల్ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ యు.నరేంద్ర, డాక్టర్ యు.లలిత, స్థానిక ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అడ్వకేట్ పలగాని చంద్రశేఖరరెడ్డి, టీచర్ నాగమణి తదితరులు పాల్గొని మాట్లాడారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ముందుగా జెండా చెట్టు వీరాంజనేయ స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో దుంపా అజయ్ కుమార్‌రెడ్డి, దుంపా మౌనిక, శీలం అయ్యప్ప రెడ్డి, మర్రెడ్డి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## పెరుగుతున్న చలి తీవ్రత



ఉదయం 8 గంటల వేళ మంచు ప్రభావం ఇలా..

కొనకనమిట్ల: వాతావరణంలో మార్పుల కారణంగా కొన్ని రోజులుగా మంచుతోపాటు చలి ప్రభావం రోజు రోజుకూ పెరుగుతోంది. చలి ప్రభావంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల చలి పెరగడంతో పాటు మంచు ప్రభావం కూడా ఉదయం 9, 10 గంటల వరకు ఉండటంతో ముఖ్యంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో గ్రామాల్లో పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే మంచుతో చలి పెరగడంతో పొలం పనులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు రైతులు పేర్కొన్నారు. చలి ప్రభావంతో ఉదయాన్నే ప్రజలు చలి మంటలు వేసుకుంటూ చలి కాగుతున్నారు. మంచు, చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో పలువురు జలుబు, జ్వరాలతో పాటు న్యూమోనియా వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రస్తుత తరుణంలో చిన్న పిల్లలు, వృద్ధులు పట్ల అప్రమత్తంగా ఉండి వారు వ్యాధుల బారిన పడకుండా చూడాలని ప్రభుత్వ వైద్యులు బాలయ్య, పృథ్వీరాజ్‌లు సూచిస్తున్నారు. మంచులో సంచరించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో బయట తిరిగే వారు తలకు, శరీరానికి చలిని నివారించే ఉన్ని దుస్తులు ధరించాలని, చిన్నారులను బయట తిప్పడం మానుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రయాణించే సమయాల్లోనూ చలి తీవ్రత నుంచి రక్షణ కలిగించే దుస్తులు వాడుకోవాలని తెలిపారు.